క్లుప్తంగా

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు



పెద్దరంగాపురంలో నూతనంగా నిర్మించిన ఆలయం

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని పెద్దరంగాపురంలో అంకాలమ్మ తల్లి నూతన ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు బుధవారం నుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామస్తులు చందాలు వేసుకుని దాదాపు రూ.50లక్షలతో దేవస్థాన నిర్మాణ చేపట్టారు. నేటి నుంచి గణపతి పూజతో ప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభిస్తారన్నారు. గురువారం చెక్కభజన, గజపూజ, అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. శుక్రవారం బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. మొదటి బహుమతి రూ.60వేలు, ద్వితీయ, తృతీయ, నాల్గవ బహుమతులకు రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు చొప్పున నిర్వాహకులు అందించనున్నారు. ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది బహుమతులు కూడా ఇవ్వనున్నారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి రూ.5వేలు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

పంట నమోదు తప్పనిసరిగా చేయించాలి



తిప్పిరెడ్డిపల్లె పొలాల్లో పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ ఓబులేసు

పెండ్లిమర్రి : పంటలు సాగు చేసిన ప్రతి రైతు పంట నమోదు తప్పని సరిగా చేయించాలని వ్యవసాయాధికారి ఓబులేసు తెలిపారు. మంగళవారం మండలంలోని తిప్పిరెడ్డిపల్లె గ్రామ పొలాల్లో సాగు చేసిన పత్తి పంటను ఆయన పరిశీలించి మాట్లాడారు. పంట నమోదు చేయకపోతే ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీలు రావన్నారు. పంట సాగు చేసిన ప్రతి ఎకరా పంట నమోదు చేయాలన్నారు. మండలంలో ఇప్పటి వరకు 2,346 ఎకరాల్లో పత్తి, వేరుశనగ, మినుము, వరి, కొర్ర, ప్రొద్దుతిరుగుడు పంటలు సాగు చేశారన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ కృష్ణచైతన్య రైతులు పాల్గొన్నారు.

కిల్కారీ ఫోన్‌కాల్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఐషా

సింహాద్రిపురం : మండలంలోని బిదినంచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ఐషా ఆధ్వర్యంలో కిల్కారీ ఫోన్ కాల్‌పై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిల్కారి రీజనల్ కోఆర్డినేటర్ కీర్తి పాల్గొని మాట్లాడుతూ సంవత్సరంలోపు పిల్లలు ఉన్న తల్లులు, బాలింతలకు కిల్కారీ ఫోన్‌కాల్ ద్వారా సేవలను అందిస్తుందన్నారు. ఏ సమయంలో ఇంజక్షన్ వేయించుకోవాలి, ఎలాంటి ఆహారం తినాలి, తల్లిపాల ప్రాముఖ్యత, రక్తహీనత రాకుండా పిల్లలకు టీకాలు వేయించడం ఇలా ఆరోగ్య సేవలను వివరించే కిల్కారీ ఫోన్‌కాల్ తెలుపుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ డెమో రమణమ్మ, ఎంపీహెచ్‌ఓ సుకుమార్, డీహెచ్‌ఎస్ పద్మావతమ్మ, సూపర్‌వైజర్ లక్ష్మిదేవి, ఏఎన్‌ఎంలు, సీహెచ్‌ఓలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మినుము పంట దున్నేస్తున్న రైతన్నలు



ఎర్రగుడిపాడులో దున్నేసిన మినుము పంట

కమలాపురం : మండల పరిధిలోని ఎర్రగుడిపాడు, పందిళ్లపల్లె, కోగటం, కంచన్నగారిపల్లె తదితర గ్రామాల్లో ఖరీఫ్‌లో సాగు చేసిన పంటను రైతన్నలు దున్నేస్తున్నారు. ఖరీఫ్ ప్రారంభంలోనే ఓ మోస్తారు వర్షాలు కురవడంతో గతంలో ఎన్నడూ లేనంతగా రైతన్నలు మినుము పంటను సాగు చేశారు. తర్వాత వరుణుడు ముఖం చాటేయడంతో పంటలు ఎండుదశకు చేరుకున్నాయి. ఇక పంటలు చేతికందే పరిస్థితులు లేవనే కారణంతో రైతులు సాగు చేసిన మినుము పంటను దున్నేస్తున్నారు. అధికారులు తమ కష్టాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని ఎర్రగుడిపాడుకు చెందిన రైతులు వైపే సుబ్బారెడ్డి, గోపాల్‌రెడ్డి, వైకే సుబ్బారెడ్డి తదితరులు కోరుతున్నారు. సాగు, సేద్యం, మందుల ఖర్చులు ఏకరాకు రూ.15–20 వేల వరకు అయ్యాయని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తమను ఆర్థికంగా ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

పులివెందుల అరటికి భలే గిరాకీ

- నియోజకవర్గంలో 15 వేల ఎకరాలలో అరటి సాగు
- ఇక్కడ నుంచి గల్ఫ్ దేశాలకు ఎగుమతి
- టన్ను అరటి రూ.16వేలతో కొంటున్న వ్యాపారులు
- హర్షం వ్యక్తం చేస్తున్న అరటి రైతులు



పులివెందులలో సాగులో ఉన్న అరటి

పులివెందుల రూరల్ : పులివెందుల నియోజకవర్గం అరటి సాగుకు ప్రసిద్ధి. పులివెందుల అరటికి ఢిల్లీతో పాటు విదేశాల్లో కూడా మంచి డిమాండ్ ఉంది. వ్యాపారులు తోటల వద్దకు వెళ్లి ఢిల్లీ మార్కెట్‌కు అనుకూలంగా ఉన్న తోటలను ఎంచుకుని అరటికాయలను కొనుగోలు చేస్తారు. రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి ధరలు నిర్ణయించి కొనుగోలు చేయడం ద్వారా దళారుల బెడద లేకుండా పోయింది.

నియోజకవర్గంలో 15 వేల ఎకరాల్లో..

పులివెందుల నియోజకవర్గంలో 15 వేల ఎకరాలల్లో అరటి కోతకు రానుంది. నియోజకవర్గ వ్యాప్తంగా 15వేల ఎకరాల్లో అరటి సాగు ఉంటే ఇందులో 10 వేల ఎకరాల్లో మొదటి కోతకు రానుంది. నియోజకవర్గంలోని పులివెందుల, లింగాల, వేముల, వేంపల్లె మండలాల్లో అధికంగానూ, తొండూరు, సింహాద్రిపురం మండలాల్లో తక్కువగా సాగు అవుతోంది. ఒకసారి సాగు చేస్తే మూడు పంటలు తీయవచ్చన్న ఉద్దేశంతో రైతులు అరటిని ఎంచుకుంటున్నారు. ఎక్కువగా మే, జూన్, జులై నెలల్లో అరటిని సాగుచేస్తారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో కోతకు వస్తాయన్నారు. ఈ సమయంలో అరటి ధరలు ఎక్కువగా ఉంటాయని రైతులు అంటున్నారు.

ఎకరాకు రూ.60 వేలు పైనే పెట్టుబడులు..

అరటి సాగులో పెట్టుబడులు కూడా అధికం అవుతున్నాయి. ఎకరా అరటి సాగు చేయాలంటే రూ.60వేల నుంచి రూ.70వేల వరకు పెట్టుబడులు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. అరటి సాగు చేసిన 11 నెలలకు తోటలలో గెలలు కోతకు వస్తాయి.

అరటికి డ్రిప్పు ద్వారా నీటి తడులతో పాటు ఎరువులు అందించడంతో పంట దిగుబడి అధికంగా ఉంటుందన్నారు. సాగులో ఎకరాకు 10 నుంచి 15 టన్నుల వరకు దిగుబడులు వస్తాయి.



అరటికాయలను మందులో అద్దుతున్న కూలీలు



అరటికాయలను ప్యాకింగ్ చేస్తున్న కూలీలు

వారం రోజుల పాటు నిల్వ ఉంటాయి..



పులివెందుల నుంచి అరటిని ఢిల్లీకి తరలించాలంటే వారంరోజులు పడుతుంది. పక్వానికి వచ్చిన అరటి గెలలను కొట్టి చీపులను వేరుచేస్తారు. ఎలాంటి రసాయనాలు వాడకుండా వారం పాటు నిల్వ ఉండటంతో ఢిల్లీకి చెందిన వ్యాపారులు పులివెందుల అరటి కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నారు. ఇక్కడి నుంచి ఢిల్లీకి వెళ్లేసరికి అరటి గెలలు దెబ్బతినవని, కాయలు నాణ్యతగా ఉంటాయని వ్యాపారులు చెబుతున్నారు. అరటికాయలను శుద్ధిచేసి ఒక్కో అట్టపెట్టెలో 15కిలోల చొప్పున ప్యాక్ చేస్తారు. తోటల వద్దనే తూకాలు వేసి అట్టపెట్టెలను సీజ్ చేస్తారు. నెలకు 10నుంచి 15వేల టన్నుల మేర అరటి కాయలు ఢిల్లీ మార్కెట్‌కు తరలి వెళ్తున్నాయి.

- రాఘవేంద్రారెడ్డి, హెచ్‌ఓ, పులివెందుల

గల్ఫ్ దేశాలకు ఎగుమతి చేస్తాం..



పులివెందుల ప్రాంతంలో పండిన అరటికి ఢిల్లీతో పాటు గల్ఫ్ దేశాల్లో మంచి డిమాండ్ ఉంది. ఢిల్లీ మార్కెట్‌తో పాటు గల్ఫ్ దేశాలకు అరటిని తరలిస్తున్నాము. ఇక్కడ పండించిన అరటి నాణ్యతగా ఉండటంతోపాటు వారం రోజుల పాటు నిల్వ ఉండటంతో గల్ఫ్ దేశాల్లో డిమాండ్ ఉంటుంది.

- రామమల్లేశ్వరరెడ్డి, అరటి రైతు, పులివెందుల

మార్కెట్‌లో ధరలు బాగానే ఉన్నాయి..



ప్రస్తుతం అరటికాయలకు మార్కెట్‌లో ధరలు బాగానే ఉన్నాయి. టన్ను రూ.16వేల నుంచి రూ.18 వేలు ఉండటంతో రైతులు అరటిని సాగుచేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ధరలు ఇలాగే ఉంటే అరటి సాగు చేసేందుకు చాలా మంది రైతులు ముందుకొచ్చే అవకాశం ఉంది. పులివెందుల ప్రాంతాలోని అరటిని కొనుగోలు చేసేందుకు బెంగుళూరు, తమిళనాడు, కర్ణాటక, తదితర ప్రాంతాల నుంచి వ్యాపారస్తులు వస్తుంటారు.

- శివ, అరటి రైతు, పులివెందుల

8న పాఠశాల కమిటీ ఎన్నికలు

పెద్దముడియం : మండలంలోని అన్ని పాఠశాలలో 8వ తేదీన పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు జరుగుతాయని ఎంపీడీవో లక్ష్మీనరసింహ్మా తెలిపారు. ఇందులో భాగంగా 7వ, 8వ తేదీలలో పాఠశాలలో జరిగే ఎన్నికలకు పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలని సెలవు పెట్టడానికి వీలు లేదని తెలిపారు. సెలవులో ఉన్న వారు కూడా విధులకు హాజరు కావాలని తెలిపారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

జమ్మలమడుగు : పట్టణంలో కొన్ని కార్పొరేట్ పాఠశాలల్లో ఒలంపియాడ్ పేరుతో విద్యాబోధన చేస్తూ రూ. లక్షలు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఈఓ కృష్ణప్పకు రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు జగన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. పట్టణంలో ఐఐటీ, నీట్ ఒలంపియాడ్‌ల పేరుతో బోధన జరుగుతున్నా విద్యాశాఖాధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదన్నారు.

జిల్లా ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయండి

జమ్మలమడుగు : ఈనెల 7, 8వ తేదీలలో జరిగే జిల్లా ఎస్‌ఎఫ్‌ఐ ప్లీనరీ సమావేశాలను విజయవంతం చేయాలని ఎస్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక డిగ్రీకాలేజీలో ఆయన కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. ప్రభుత్వం విద్యారంగంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు.

పారదర్శకంగా రేషన్ పంపిణీ జరగాలి

వల్లూరు (చెన్నూరు) : మండలంలో రేషన్ పంపిణీ పారదర్శకంగా జరగాలని నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ జీవన్‌చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయనను కలసిన డీలర్లతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలంలోని చౌకదుకాణాలు, వాటి పరిధిలో రేషన్ పంపిణీ తీరుపై ఆయన డీలర్లను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు యాసిన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతు ఇ క్రాప్ నమోదు చేయించుకోవాలి



వేముల : ఇ పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ చెన్నారెడ్డి



చక్రాయిపేట : పంటనమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారి

వేముల : ఖరీఫ్‌లో సాగుచేసిన ప్రతి పంటకు ఇ–క్రాప్ పంట నమోదు చేయించుకోవాలని ఏఓ చెన్నారెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని పెద్దజూటూరు గ్రామంలో వ్యవసాయ శాఖ సిబ్బంది చేస్తున్న ఇ–క్రాప్ పంట నమోదును మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతు సేవాకేంద్రం అసిస్టెంట్లు రెవెన్యూ సిబ్బందిని సంప్రదించి సాగు చేసిన పంటలకు రైతులు ఇ పంట నమోదు చేయించుకోవాలన్నారు. ఇ పంట నమోదు చేస్తేనే ప్రభుత్వం అందించే పథకాలు రైతులకు అందుతాయన్నారు. ప్రతీరైతు ఈకెవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. మండల వ్యాప్తంగా బుధవారం నుంచి అన్ని గ్రామాల్లో ఇ పంట నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. పంటలు సాగుచేసిన ప్రతీ రైతు పొలానికి రైతు సేవా కేంద్రం అసిస్టెంట్లు వెళ్లి ఇ క్రాప్ చేస్తారన్నారు. పంట సాగుచేసిన సర్వే నెంబరులోకి వెళ్తేనే ఇ క్రాప్ నమోదు చేసే కెమెరా ఆన్ అవుతుందని, లేకపోతే ఇ పంట నమోదు చేసేందుకు వీలుండదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీకే వీఏఏ శివప్రసన్న రైతులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

చక్రాయపేట : రైతులు తమ పొలాల్లో సాగు చేసిన పంటల వివరాలను ఆగ్రామాల్లోని రైతు సేవాకేంద్రాల్లో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి నవంత్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన మారెళ్లమడక గ్రామంలో వీఏఏ అంజలితో కలసి పంట నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. వరి పంటలో కాలి బాటల వలన కలిగే ఉపయోగాలు, వరి పైరు కొనలను తుంచి నాటడం వల్ల కలిగే లాభాలను వివరించారు.

నేడు మండల సమావేశం

వీరపునాయునిపల్లె : స్థానిక మండల ప్రజా పరిషత్ సభా భవనంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల అధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మండల ప్రజా ప్రతినిధులతోపాటు మండల స్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

రెండు రోజులు నీటి సరఫరా బంద్

జమ్మలమడుగు : మున్సిపాలిటీ పరిధిలో 9,10వ తేదీల్లో తాగునీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు అందించే తాగునీటికి సంబంధించి దొమ్మరనంద్యాలలో ఉన్న నీటి శుద్ధికేంద్రాన్ని శుభ్రం చేయడంలో భాగంగా తాగునీరు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

డీఏవీ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



పోటీలలో ప్రతిభ చూపిన డీఏవీ స్కూల్ విద్యార్థులు

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని జువారి కర్మాగారంలో ఉన్న డీఏవీ స్కూల్ విద్యార్థులు ఆంధ్ర, కర్ణాటక క్లస్టర్ స్థాయి క్రీడా పోటీలలో ప్రతిభ కనపరించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎన్నికయ్యారని డీఏవీ స్కూల్ ప్రిన్సిపాల్ ఎంవీజీఎస్ నాయుడు తెలిపారు. ఈనెల 4వ తేదీన కర్ణాటకలోని వాడిలో జరిగిన క్రికెట్ పోటీలలో బంగారు పతకం, బాడ్మింటన్, చెస్ పోటీల్లో వెండి పతకం, రన్నింగ్‌లో కాంస్య పతకాన్ని సాధించారని తెలిపారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారన్నారు.

ఆశావర్కర్లకు అవగాహన

లింగాల : స్థానిక పీహెచ్‌సీలోని సభాభవనంలో మంగళవారం ఆశాడే సందర్భంగా ఆశావర్కర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కిల్కారీ రీజనల్ కో ఆర్డినేటర్ కీర్తి మాట్లాడుతూ కిల్కారీ అంటే చిన్నారి చిరునవ్వు అని అన్నారు. 01244451660 అనే నెంబరు నుంచి ఫోన్ కాల్స్ ద్వారా ఆరోగ్య కార్యకర్తలు నమోదు చేసుకున్న ప్రతి గర్భిణీలకు, బాలింతలకు కేంద్ర ప్రభుత్వంచే తెలుగు భాషలో సంభాషణ వస్తుందన్నారు. దీని ప్రధాన ఉద్దేశం గర్భిణీ స్వీయసమాచార సేవ గర్భిణీల 4వ నెల మొదటి వారం నుంచి ప్రసవించిన తర్వాత బిడ్డ వయసు 10 నెలలు పూర్తయ్యే వరకు ఇలాంటి ఫోన్‌కాల్స్ వస్తుంటాయన్నారు. ప్రతీ వారం ఒకటిన్నర నిమిషం పాటు 72 వారాలు వస్తాయని తెలిపారు. ప్రసూతి డాక్టర్లు ఈ కాల్స్ ద్వారా గర్భిణి సంరక్షణ, వారికి అందాల్సిన ఆరోగ్య సేవలు, పోషకాహారం, ఆరోగ్య సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరిస్తారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో రమణమ్మ, పీహెచ్‌సీ వైద్యాధికారి కళ్యాణ్ దినకర్, డీపీఎన్‌ఓ రమణారెడ్డి, సీహెచ్‌ఓ శివరాం, పీహెచ్‌ఎన్ కుసుమ కుమారి, ఎంపీహెచ్‌ఎస్ ఆసియాభేగం, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

డీఎస్పీ మురళీనాయక్



మాట్లాడుతున్న డీఎస్పీ మురళీనాయక్

పులివెందుల రూరల్ : పులివెందుల డివిజన్ పరిధిలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ మురళీనాయక్ తెలిపారు. మంగళవారం డీఎస్పీ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. పులివెందుల ప్రాంతం, మండలాల్లో జూదం, మట్కాపై ప్రత్యేక దృష్టి సారించి కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఎన్నికల ముందు, ఎన్నికల తర్వాత పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పట్టణాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అధిక లోడ్‌తో వెళ్తున్న ఆటోలను, లారీలను ఆపి అధిక లోడ్‌తో వెళ్తే జరిగే ప్రమాదాల గురించి అవగాహన కల్పించాలన్నారు. ఫ్యాక్షన్ గ్రామాల్లో చిన్నచిన్న గొడవలు పడినా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసు నమోదు చేస్తామన్నారు. డివిజన్ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లోనూ, మండలాల్లోనూ ఎటువంటి సమస్యలు వచ్చినా సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐలు శంకర్‌రెడ్డి, బాలమద్దిలేటి, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య

తొండూరు : సంతకొవ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి శ్రావణ్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఆశాడే కార్యక్రమాన్ని నిర్వహించి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. తల్లిపాల విశిష్టత గురించి వివరించారు. హెచ్‌బీవైసీలో పిల్లలకు అందజేయాల్సిన సేవల గురించి తెలిపారు. ఆశాకార్యకర్తలు కిల్కారీ సేవల గురించి గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించాలన్నారు. సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య మాట్లాడుతూ ప్రతి ఆరోగ్య కార్యకర్త తమ పరిధిలోని ప్రతి గ్రామాన్ని, ప్రతి ఇంటిని దర్శించి జ్వరాలు ఉన్న వారిని గుర్తించి తప్పని సరిగా రక్తపరీక్ష చెయ్యాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలన్నారు. మంచి నీటి నిల్వలలో పెరిగే దోమ మలేరియా వ్యాధిని వ్యాప్తి చేస్తుందన్నారు. దోమకాటు వల్ల డెంగీ, చికెన్ గున్యా వస్తాయన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రమణ్యం, పీహెచ్‌ఎన్ సుభద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతం లాంటివి



కమలాపురం: ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



సింహాద్రిపురం : అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ శ్రీలత

కమలాపురం : తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని ఐసీడీఎస్ సూపర్ వైజర్ షంషాద్ బేగం తెలిపారు. మంగళవారం కమలాపురం సెక్టార్ పరిధిలోని కొలిమివీధి అంగన్‌వాడీ సెంటర్‌లో ఫస్ట్ సచివాలయం పరిధిలోని అంగన్‌వాడీలు నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అంతకు ముందు ర్యాలీ నిర్వహించారు. తల్లిపాలపై తల్లులకు అవగాహన కల్పించారు. బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు తాపించాలన్నారు. ఇలా తాపించడం వలన తల్లికి రొమ్ము, గర్భాశయ క్యాన్సర్, మధు మేహం తదితర రోగాలు రాకుండా ఉంటాయన్నారు. బిడ్డకు ఆరు మాసాలు వచ్చే వరకు తల్లిపాలే శ్రేష్టమన్నారు. కాన్పుకు ముందు తీసుకునే ఆహారమే కాన్పు తర్వాత కూడా తీసుకోవచ్చని, పండ్లు అధికంగా తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం


సింహాద్రిపురం : తల్లిపాలతో బిడ్డకు మంచి ఆరోగ్యం కలుగుతుందని పులివెందుల సీడీపీఓ శ్రీలత తెలిపారు. మంగళవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టినబిడ్డకు గంటలోపు తల్లిపాలు తాగించాలని, ముర్రుపాలు తాగించడం వల్ల పిల్లలలో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంత, అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు పాల్గొన్నారు.

కొండాపురం : తల్లిపాలతోనే బిడ్డకు రక్ష అని తాళ్లప్రొద్దుటూరు వైద్యురాలు రేహాన తెలిపారు. మంగళవారం మండలంలోని తాళ్లప్రొద్దుటూరులో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలలో ఆమె పాల్గొని మాట్లాడారు. బాలింతలు తప్పకుండా బిడ్డకు తల్లిపాలు పట్టాలన్నారు. తల్లి పాలలో పోషకాలు పుష్కలంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ కె.భారతి, అంగన్‌వాడీ కార్యకర్త, ఆశ వర్కర్లు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

వల్లూరు : తల్లిపాలు అమృతంతో సమానమని వైద్యాధికారి డాక్టర్ ప్రసన్నలక్ష్మి తెలిపారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం తల్లి పాలే ముద్దు–పోత పాలు వద్దు అని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఫణీంద్ర, హెల్త్ సూపర్ వైజర్‌లు మమత, సుధాకర్, సీహెచ్‌వో వేణుగోపాల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాసమ్మ, పార్వతి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం కోసం పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

వేంపల్లె : మండల అభివృద్ధి సంక్షేమం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు పనిచేయాలని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక వైఎస్‌ఆర్ సభాభవనంలో ఎంపీపీ లక్ష్మి గాయత్రీ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. త్వరలోనే వేంపల్లెలో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్‌ను ప్రారంభిస్తామన్నారు. అలిరెడ్డిపల్లె బ్రిడ్జిని త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. పాపాఘ్ని నదిలో నీరు ఉన్నా వేంపల్లె ప్రజలకు తాగునీరు సరఫరా చేయకపోవడం దారుణమని సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. తాగునీటి మోటార్లకు విద్యుత్ లైన్ వేసి తాగునీటికి కోసం టౌన్ ఫీడర్ కరెంటు సరఫరా చేయాలని విద్యుత్ అధికారులను జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి కోరారు.

రైతు బజారును త్వరలో ప్రారంభిస్తామని ఎమ్మెల్సీ చెప్పారు. వేంపల్లె మండలం వ్యాప్తంగా సబ్సిడీ పైపుల కోసం రైతులు డీడీలు తీశారని సబ్సిడీ పైపులు మంజూరు కాలేదని కాబట్టి పైపులు ఇప్పించే ప్రయత్నం చేయాలని జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి కోరారు. 650 మంది రైతుల డబ్బులు వెనక్కి ఇవ్వడమా, లేక పైపులు ఇవ్వడమా అనేది ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తామని ఎమ్మెల్సీ తెలిపారు. అలాగే ప్రస్తుతం ప్రభుత్వమే పంటలకు బీమా చెల్లిస్తుందన్నారు. ఫామ్ హౌస్‌ల నిర్మాణం కొరకు రూ.4 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచాలని జడ్పీటీసీ కోరారు. రోడ్డు పనులు నిలిచిపోవడంతో దుమ్ము ధూళితో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, అలాగే ఉర్దూ కళాశాలకు బెంచీలు సరఫరా చేయాలని ఎంపీటీసీ భారతి సభ దృష్టికి తెచ్చారు. సీఎం దృష్టికి తీసుకెళ్లి రోడ్డు పనులు పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. 18 మంది బాధితులకు గాను దాదాపు రూ.3 కోట్లు నష్ట పరిహారం రావాల్సి ఉందని ఏఈ తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద పనులు చేసిన వాటికి బిల్లులు మంజూరు చేయాలని కోరారు. రైతు బజారులో విక్రయాలు చేసుకునే రైతులనుంచి ఎలాంటి గేట్‌ను వసూలు చేయడం అనేది ఉండదని ఎస్టేట్ మేనేజర్ రుచిత తెలిపారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్లో జరిగే అక్రమాలపై పలువురు క్రీడాకారులు ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేశారు. సమావేశంలో ఎంపీడీఓ సంపతి దివిజా, అగ్రికల్చర్ ఏడీ అంబవరం ప్రభాకర్ రెడ్డి, సీఐ చాంద్‌బాషా, విద్యుత్ శాఖ ఏడీ శ్రీకాంత్ రెడ్డి, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.